10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

బుధవారం 16 అక్టోబర్ 2024 పేజీలు 8

## కాంగ్రెస్ వచ్చాక తెలంగాణలో

# కొలువుల జాతర





హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత రాష్ట్రంలో కొలువుల జాతరను స్టార్ట్‌చేసిందని మంత్రి సీతక్క తెలిపారు. ఇవాళ బంజారా హిల్స్‌లోని పంచాయతీ రాజ్ ఆఫీస్‌లో ఇటీవల నియమాక పత్రాలు అందుకున్న ఏఈఈల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్యూటీని నిబద్ధత, అంకితభావంతో పనిచేసి, ప్రజలకు సేవ చేయాలన్నారు. 'బీఆర్ఎస్‌పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను పట్టించుకోలేదు. ఉద్యోగాలు ఇవ్వక నిరుద్యోగులను ఇబ్బందులు పెట్టింది. ఏళ్లకొద్ది నిరుద్యోగుల కష్టాలను కాంగ్రెస్ వచ్చిన తర్వాత దూరం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి, పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు. మేనిఫెస్టోలో ఇచ్చిన్నట్లు జాబ్‌క్యాలెండర్‌ప్రకటించారు. అధికారులుగా ప్రజాప్రభుత్వంలో భాగస్వామ్యం కావాలి. కష్టపడి పనిచేయాలి. మీ కుటుంబానికి, ప్రభుత్వానికి మంచి పేరును తీసుకురావాలి. పనితనంతోనే గుర్తింపు వస్తుంది. శాశ్వతంగా నిలిచిపోయేలా మీ పనులు ఉండాలి. నాణ్యతపై ఎక్కడ రాజీ పడొద్దు' అని మంత్రి సీతక్క అన్నారు.

## రాడార్ కేంద్రానికి రేవంత్ రెడ్డి

# సహకరించారు

### రాజ్‌నాథ్ సింగ్ అభినందన



- సీఎంతో కలిసి వికారాబాద్ జిల్లాలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన
- పార్టీలు వేరైనప్పటికీ దేశ అభివృద్ధిలో అందరూ కలిసి ముందుకు సాగాలని సూచన
- కమ్యూనికేషన్‌లో పావురాలు, గుర్రాల దశ నుంచి ఈ స్థాయికి వచ్చామన్న కేంద్రమంత్రి

హైదరాబాద్ పెన్ పవర్:వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరించారని, అందుకు ఆయనకు అభినందనలు తెలుపుతున్నానని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో వీఎల్ఎఫ్

-2 లో


# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల.. హాల్ టికెట్లు అందుబాటులో..

## తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ హైదరాబాద్..

- గ్రూప్-1 సర్వీసెస్ (జనరల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ నం. 02/2024..
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ..
- 21/10/2024 నుండి 27/10/2024 వరకు మధ్యాహ్నం 2. నుండి సాయంత్రం 5 గంటల వరకు..
- అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు..
- పరీక్షా కేంద్రం గేట్లు మధ్యాహ్నం 1:30 గంటలకు మూసి వేస్తారు.. ఆతర్వాత అనుమతించరు..
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ఓ ప్రకటనలో పేర్కొన్నారు..




మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 15: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో గుర్తించబడిన 46 పరీక్షా కేంద్రాల్లో 21/10/2024 నుండి 27/10/2024 వరకు మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించ నున్నట్లు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు..అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకొనేందుకు 14.10.2024 నుండి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచబడ్డాయని కలెక్టర్ సూచించారు.. అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, పరీక్షా కేంద్రం గేట్లు మధ్యాహ్నం 1:30 గంటలకు మూసివేయబడతాయని, తర్వాత అభ్యర్థులు ఎవరినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరని కలెక్టర్ స్పష్టతను తెలిపారు.. మొదటి పరీక్షకు ఉపయోగించిన అదే హాల్ టిక్కెట్‌ను మిగిలిన ఆరు పరీక్షలకు (అంటే 21-10-2024 నుండి 27-10-2024 వరకు) ఉపయోగించాలని. సూచించారు..



గౌతమ్ పోట్రు..
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్..

### గ్రూప్-1 పరీక్షలో అభ్యర్థులకు సూచనలు..

అభ్యర్థులు (i) నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు (ii) పెన్సిల్ ఎరేజర్ (i) హాల్ టికెట్‌ను దానిపై అతికించిన ఫోటో (iv) ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డ్‌ని మాత్రమే పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లాలని అన్నారు.. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్ (నీలం/నలుపు)తో మాత్రమే వ్రాయబడతాయి. అభ్యర్థి ఫోటోగ్రాఫ్ సంతకంతో ముద్రించినవి స్పష్టంగా ఉన్నట్లయితేనే ఈ హాల్ టికెట్ చెల్లుబాటు అవుతుంది.. దీన్ని నిర్ధారించుకోవడానికి, లేజర్ ప్రింటర్‌తో ఎ4 సైజు కాగితంపై ముద్రించిన హాల్ టిక్కెట్‌ను తీసుకురావాలని, ఉత్తమంగా తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోగ్రాఫ్‌తో పాటు కలర్ ప్రింటర్‌ను పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు ప్రింటెడ్ హాల్ టికెట్‌లోని నిర్దేశిత స్థలంలో అతికించాలి. లేకుంటే అభ్యర్థి దరఖాస్తు తిరస్కరణకు గురవుతుందని తెలిపారు.

### గెజిటెడ్ అధికారి ధృవీకరణ పత్రం..

డౌన్‌లోడ్ చేసిన హాల్ టిక్కెట్‌లో అస్పష్టమైన ఛాయాచిత్రం ఉంటే, అభ్యర్థి మూడు (3) పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను సక్రమంగా చివరిగా అధ్యయనం చేసిన సంస్థ యొక్క గెజిటెడ్ అధికారి/ప్రిన్సిపాల్ చేత ధృవీకరించబడిన ఒక అండర్‌టేకింగ్‌తో పాటు (www.tspsc.gov వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌ను తీసుకురావాలని మరియు పరీక్ష హాల్‌లోని ఇన్విజిలేటర్‌కు అప్పగించాలని విఫలమైతే అభ్యర్థి పరీక్ష హాల్‌లోకి అనుమతించబడరని కలెక్టర్ గౌతమ్ పోట్రు తెలిపారు. అభ్యర్థి తమ గ్రూప్-I సర్వీసెస్ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంచుకున్న భాషలో అన్ని మెయిన్స్ పరీక్షలను (జనరల్ ఇంగ్లీష్ మినహా) రాయాలని. పరీక్షను ఎంచుకున్న భాషలో కాకుండా ఇతర భాషలో వ్రాసినట్లయితే, అటువంటి సమాధానాల బుక్‌లెట్‌లు మూల్యాంకనం చేయబడవని తెలిపారు.. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌పై ముద్రించిన సూచనలను తప్పకుండా చదవాలని కలెక్టర్ సూచించారు..

## 18 ఏళ్ళు నిండిన యువత.. ఓటరు నమోదు చేసుకోవాలి..

### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి..



- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన అదనపు కలెక్టర్, డిఆర్వో..
- జిల్లాలో ఓటరు నమోదు శాతాన్ని పెంచాలని సంబంధిత అధికారులకు సూచన..
- 18 ఏళ్లు నిండిన యువత శాతం ఎక్కువే ఉన్నప్పటికీ ఓటరు నమోదు శాతం లేదన్న జేసి..
- ప్రస్తుతం మేడ్చల్ జిల్లాలో 2435 పోలింగ్ బూతులు ఉన్నాయన్నారు..
- 1500 మందికి ఒక పోలింగ్ బూతు ప్రకారం జిల్లాలో అదనంగా 38 పోలింగ్ బూతుల ఏర్పాటు..

-4 లో

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను.. పకడ్బందీగా నిర్వహించాలి..

### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీస్) రాధికా గుప్తా..

- ఛీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్, డిపార్ట్‌మెంట్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌లతో జేసీ సమీక్ష..
- గ్రూప్-1 పరీక్షలో ప్రతీ అంశాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలి..
- ఛీఫ్ సూపరింటెడెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌళిక వసతులను కల్పించాలి..

-2 లో



# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను.. పకడ్బందీగా నిర్వహించాలి..

## మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీస్) రాధికా గుప్తా..



అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డిఆర్‌వో హరిప్రియ..



- **చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్, డిపార్ట్‌మెంట్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌లతో జేసీ సమీక్ష..**
- **గ్రూప్-1 పరీక్షలో ప్రతీ అంశాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించాలి..**
- **చీఫ్ సూపరింటెడెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌళిక వసతులను కల్పించాలి..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 15:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహిస్తున్న గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షలు ఎలాంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశించారు..పరీక్షా విధులు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి, పరీక్షలు ప్రశాంతంగా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్తా అన్నారు..మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో టిజిపిఎస్‌సి గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి డిఆర్ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ రాధికా గుప్తా హాజరయ్యారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఆఫీసర్లు, డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ఆఫీసర్లు వారికి కేటాయించిన విధులను సమయపాలన పాటిస్తూ, ఏలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఒక్క అంశం నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు.. సంబంధిత సిబ్బందికి కేటాయించిన వరకు మాత్రమే విధులను నిర్వహించాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.. చీఫ్ సూపరింటెడెంట్లు పరీక్షా కేంద్రాలను పరిశీలించి అవసరమైన మౌళిక వసతులను ఏర్పాటు చేసుకోవాలన్నారు.. సమన్వయంతో గ్రుప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలను సూచించారు. పోలీసు భద్రత, నిరంతరాయ విద్యుత్తు, త్రాగునీటికై సంబంధిత శాఖల అధికారులతో కోఆర్డినేట్ చేసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.. డిపార్ట్ మెంట్ ఆఫీసర్లు ఒకరోజు ముందుగానే కేటాయించిన పరీక్షా కేంద్రాలను సందర్శించి పరిశీలించుకోవాలన్నారు.. పరీక్షా సెంటర్‌లకి రూట్ మ్యాప్‌లు, సైన్ బోర్డ్స్, సీటింగ్ అరేంజ్ మెంట్ వంటి వాటిని సరిగా ఉన్నాయా లేవా పరిశీలించాలి. ఈ పరీక్షలకు విధులు నిర్వహిస్తున్న అధికారులందరి మోబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రాలలోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేసారు. సంబంధిత అధికారులు వారి నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అధికారులకు అందించే డైరీ ప్రకారం టైమ్ టు టైమ్ సరైన విధంగా విధులు నిర్వహించాలని అన్నారు..



రాధికా గుప్తా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్(లోకల్‌బాడీస్)

---

# రాడార్ కేంద్రానికి రేవంత్ రెడ్డి సహకరించారు

- మొదటి పేజీ తరువాయి

కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ రాడార్ స్టేషన్‌కు సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీలు వేరైనప్పటికీ దేశ అభివృద్ధిలో అందరూ కలిసి ముందుకు సాగాలని సూచించారు.

రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరు ఉందని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. అబ్దుల్ కలాం జయంతి రోజున ఇలాంటి కార్యక్రమం చేపట్టినందుకు ఆనందంగా ఉందన్నారు. దేశ భద్రతకు వీఎల్ఎఫ్ స్టేషన్ కీలకమని, కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. దేశ రక్షణకు ఇది అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

### పావురాలు, గుర్రాల దశ నుంచి ఈ స్థాయికి వచ్చాం

కమ్యూనికేషన్ రంగంలో మనం పావురాలు, గుర్రాల దశ నుంచి ఇక్కడి వరకు వచ్చామన్నారు. తపాలా వ్యవస్థను అనేక ఏళ్ళు వినియోగించుకున్నామని కేంద్రమంత్రి అన్నారు. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగమని, క్షణాల్లో సమాచారం ప్రపంచానికి చేరుతోందన్నారు. సమాచార విప్లవం ఈరోజు దేశాలన్నింటినీ దగ్గర చేస్తోందని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల్లో సమాచార విప్లవం కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. ఇంట్లో కూర్చొని అనేక కోర్సులు నేర్చుకుంటున్నారని తెలిపారు.

### రాడార్ స్టేషన్ కోసం 2,900 ఎకరాల భూమి అప్పగింత

ఇది భారత నౌకాదళానికి సంబంధించిన వెరీ లో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో శంకుస్థాపన చేశారు.

రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం ఇక్కడి అటవీ శాఖకు చెందిన 2,900 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వం ఆరు నెలల క్రితం విశాఖపట్నం కేంద్రంగా పని చేస్తోన్న ఈస్టర్న్ నావెల్ కమాండ్‌కు అప్పగించింది. ఇక్కడ రాడార్ స్టేషన్‌తో పాటు టౌన్ షిప్‌ను నిర్మిస్తున్నారు. ఇందులో స్కూల్స్, హాస్పిటల్స్, బ్యాంకు, మార్కెట్ తదితర సదుపాయాలు ఉండనున్నాయి.

ఈ టౌన్ షిప్‌లో 3,000 మంది వరకు నివసించే అవకాశం ఉంటుంది. ఉద్యోగులు, సిబ్బంది 600 మందికి పైగా ఉంటారు. ఈ వీఎల్ఎఫ్ కేంద్రాన్ని 2027 లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



# మూసీ ముచ్చట్లు..

ఎపిసోడ్-4

# రైతన్నల ఆకలి తీర్చిన తల్లి...

# మా మూసీనది



మూసీనది పెద్ద కాలువపై పంటపొలాలకు నీళ్లకోసం మోటార్లు..

ఆకుతోటబాయి, జేత్ల బాయి, సాట బాయి, మర్రిబాయి,గొల్లోంబొంద, దుబ్బల్ల బాయి, తమ్మలోని బాయి, పెద్దబాయి, బీరప్ప బాయి.. ఇట్ల మా ఊరుసుట్టూ ఎన్నోబావులు..బావుల్లో ఊరే గిన్నన్ని నీళ్లతోనే బావుల కాడ ఒకటి రెండు మడికట్లు కడితే కొంత వరి సాగయ్యేది.. మెల్లమెల్లగా బాయిలల్ల నీళ్లు తగ్గిపోతుండటంతో శానా మంది రైతులు బోర్లేయడం మొదలు పెట్టిండ్రు. రెండించుల నీళ్లు కొంత మందికే పడేవి. శానా మందికి అప్పే మిగిలేది. ఊరి సుట్టుపక్కల బోర్లేస్తే ఉప్పు నీళ్లే ఒచ్చేవి. అందుకే ఒకనాడు మా ఊర్ల ఎవుసాయ అంటే కాల్వకింద భూములున్నోదళ్లే. వాగులు, వంకలను కలుపుకుంట గలగల పారొచ్చే మూసీ జలాలే పంటలకు ఆధారం. మా ఊర్ల ఉన్న కత్వ మీద నుంచి పారే పెద్ద కాల్వల మూసీ నీళ్లు అట్లా పారుతూ కానాల మీదుగా పొలాలను తడుపుతూ పోయేవి..

## పొలాలకు గమ్మత్తైన పేర్లు..

మా ఊర్ల ఎనబై శాతం మందికి ఈ కాల్వ కింద ఎంతో కొంత భూమి ఈనాటికీ ఉంది. ఇరవై అయిదేండ్ల కింద వరకు కూడ మూసీల నీళ్లు మంచిగనే ఉండేవి. వాగులు, వంకలు వచ్చి నదిల చేరేవి. గీ కాల్వ కింద పొలాలకు కూడ గమ్మతు గమ్మతు పేర్లుండేవి. మూల మడత, తోకమడుగు, బొంతలోనిపంపు, ఉసికరేవు, గోవిందావుల, బోరగడ్డ... ఇట్లాంటి పేర్లతో ఆటిని పిల్చేటోళ్లు. ఆనాకాలంలో ఒక పంటకు సరిపోను నీళ్లను పెద్దకాల్వ అందించేది. యాసంగిల కొన్నిసార్లు కాల్వ ఎండిపోయేది. గందుకే ఆ కాలంల జొన్నలు, సజ్జలు, పెసర్లు, బొబ్బర్లు... ఇట్లాంటి పంటలు ఏసేటోళ్లు..

## ఎర్రటి గొట్టొడ్ల బియ్యం రుచిగా ఉండేవి..

గిప్పుడంటే యిత్తనాలు కొనుక్కొస్తున్నరు గని... అప్పుడు రైతులు ఎవరి విత్తనాలు ఆళ్లే దాచిపెట్టుకొని నార్లు పోసేటోళ్ళు. వోమ సన్నాలు, దుబ్బ సన్నాలు, మైల సన్నాలు, సాంబలు, నిజానగౌడలు, గొట్టెలు.. ఇట్లాంటి తీరొక్క రకాల వడ్లు పండేవి. గొట్టెలు మా దిక్కు శానా మంది పండించేది. ఈటిని గొట్టొడ్లు అంటరు. ఈ బియ్యంతో అన్నం వండితే తెల్లగ గాకుండ ఎరుపెరుపు ఉండేది. ఆనాకాలంలో పండిన వడ్లను బోరాలల్ల నింపుకొని ఎడ్ల బండ మీద ఇండ్లకు తెచ్చేది.. అందరి కొట్టాల్లో బర్లుండేదిగా... ఎండాకాలంలో బర్లపెంటను పొలాల్లో ఏసోటోళ్లు. ఎన్ని యూరియా బస్తాలేసినా రాని జవ మా భూములకు ఒచ్చేది. పంటలు కూడ అట్ల మంచిగ పండేవి..

**అప్పట్లో పెద్ద కాలువ పొడవునా మోటర్‌లు..**

కాలం గడుస్తున్నకొద్దీ మూసీల నీళ్లు అంతకంతకు పెరిగినయి. చెలకల కాడ, బావుల కాడ నీళ్లు తగ్గిపోయినయి. అప్పుడు అందరు కల్సి ఒక ఉపాయం ఆలోచించిర్రు. పెద్దకాల్వ పొడవునా మోటార్లు పెట్టి కాల్వపైన ఉన్న భూములకూ నీళ్లొచ్చేలా చేసిర్రు. అట్ల ఇప్పుడు కాల్వ నుంచి దగ్గెరదగ్గెర నాలుగుకిలోమీటర్ల దాంక పైపులైన్లు ఒచ్చినయి. బావుల కాడ పొలాలను గూడ మూసమ్మ తడిపింది. ఒక పదిహేనేళ్లుగా కాల్వ పైనున్న భూములు గూడ పచ్చగ మారినయి. ఒకనాడు తెల్లతుమ్మలు, బలుసు పండ్ల చెట్లు, రాళ్లు రప్పలతో ఉన్న భూముల్లో ఎక్కడ చూసినా వరి శేన్లే.

## ప్రస్తుతం మూసీ నీళ్లతో పాడైపోతున్న భూములు..

మెల్లమెల్లగ మూసీ పక్క నుంచి పోవాలంటనే ముక్కుమూసుకొని పోవాల్సిన పరిస్థితులొచ్చినయి. లక్షల రూపాయలు పోసి పైపులైన్లు ఏసిన రైతులు.. ఇప్పుడు చెల్కల కాడ భూములు కూడ మూసీ నీళ్లతో పాడైపోతున్నయని బాధపడే రోజులొచ్చె. వరి శేన్లకు దిగాలంటే కూలీలు కూడ భయపడవట్టిరి. కాళ్లు, చేతులు ఒకటే దురద. గోకి గోకి రక్తాలు రావట్టే. కాల్వ కింద ఉన్న పొలాల్లోనయితే మరింత ఇబ్బంది తప్పడం లేదాయె. వరి శేను కూడ ఇంతెత్తు పెరుగుతోంది గానీ... అంతా తాలే పోతుండె. గట్టిగ గాలొస్తే వరి శేనంతా అడ్డంపడుతుందాయె. నీళ్లనిచ్చి, ఆకలి తీర్చి, బతుకు దారి సూపిన తల్లిని మరణశయ్యపై సూస్తున్న ఘోరమైన దు:ఖం ఎట్ల తీర్తదోనని ఆ బిడ్డలు మౌనంగ విలపిస్తున్నరు!

రాజేందర్ సురకంటి
మూసీ పరివాహక ప్రాంత వాసి
సంగెం (వలిగొండ మండలం

## మూసీనది కింద రైతులకు ఆత్మహత్యలు లేవు..

మూసీ మా ప్రాంతాన్ని పచ్చగ మార్చినందుకేనేమో ఎంత కరువొచ్చినా మా ప్రాంత రైతులు ధైర్యం కోల్పోలేదు. ఆత్మహత్యలకు పాల్పడలేదు. మా బోనగిరికి దగ్గర్లనే ఉన్న గజ్వేల్ ప్రాంతం నుంచి ఎప్పుడూ రైతుల సావు వార్తలే వినిపించేవి. మా మూసమ్మ దయతో ఎంతో కొంత సాగు చేసుకొని పండిన పంటలతో కడుపునింపుకునేది మా ప్రాంత రైతులు. ఎవుసాయానికి తోడు మస్తు చేపలు. కాల్వ గట్ల పొంటి తూటికూర, బంకోటి కూర. కాయకష్టం మర్చిపోనికి కమ్మని కల్లు. గివన్ని దొర్కిన కాడ ఇంకా కష్టపడి మంచిగ బతకాలనే ఆశే ఉంటదిగా. అందుకే అంటున్న మా ప్రాంత రైతుల కడుపు నింపిన తల్లి.. మా మూసమ్మ.



# 18 ఏళ్ళు నిండిన యువత.. ఓటరు నమోదు చేసుకోవాలి..

## మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి..



విజయేందర్ రెడ్డి.. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్..



అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్వో హరిప్రియ..



- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన అదనపు కలెక్టర్, డిఆర్వో..
- జిల్లాలో ఓటరు నమోదు శాతాన్ని పెంచాలని సంబంధిత అధికారులకు సూచన..
- 18 ఏళ్ళు నిండిన యువత శాతం ఎక్కువే ఉన్నప్పటికీ ఓటరు నమోదు శాతం లేదన్న జేసి..
- ప్రస్తుతం మేడ్చల్ జిల్లాలో 2435 పోలింగ్ బూతులు ఉన్నాయన్నారు..
- 1500 మందికి ఒక పొలింగ్ బూతు ప్రకారం జిల్లాలో అదనంగా 38 పోలింగ్ బూతుల ఏర్పాటు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 15:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వార్డు మెంబర్‌ల సహకరంతో 18 ఏళ్లు నిండిన యువత ప్రతిఒక్కరూ కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా పార్టీల ప్రతినిధులు చొరవ చూపాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు.. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్వో హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా 18 ఏళ్లు నిండిన యువత శాతం ఎక్కువగా ఉన్నప్పటికి, ఓటరు నమోదు శాతం పెరగడం లేదని అన్నారు.. ఇందుకు గాను వార్డు మెంబర్‌ల భాగస్వామ్యంతో యువత కొత్తగా ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ ప్రతినిధులను కోరారు.. జిల్లాలో ఓటరు నమోదు శాతాన్ని మరింత పెంచాలని సూచించారు.. భారత ప్రభుత్వ ఎన్నికల కమీషన్ సూచనల మేరకు జిల్లాలో ఓటర్లకు అనుకూలంగా ఉండే విధంగా. 1500 మందికి ఒక పొలింగ్ బూతు ప్రకారం జిల్లాలో అదనంగా మరో



38 పోలింగ్ బూతులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.. మేడ్చల్ జిల్లాలో అదనంగా నియోజక వర్గాల వారిగా మేడ్చల్‌లో 21, మల్కాజిగిరిలో 7, కుత్బుల్లాపూర్‌లో 10 పోలింగ్ బూతులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.. ప్రస్తుతం జిల్లాలో 2435 పోలింగ్ బూతులు ఉన్నాయన్నారు.. ఓటర్లకు దగ్గరలో సౌకర్యవంతంగా ఉండేలా పరిశీలించి ఈబూతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల నెంబర్‌ల సవరింపులో కొన్ని బూతుల నెంబర్‌లు మారుతాయని,పొలింగ్ బూతు అధికారులు ఈ మార్పుపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు.. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్ రెడ్డి, పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ భేటీ

### హైడ్రా కార్యాలయంలో రంగనాథ్‌ను కలిసిన వీహెచ్

### అంబర్‌పేట బతుకమ్మకుంట వ్యవహారంపై చర్చించిన వీహెచ్

### హైడ్రాపై కేటీఆర్ కీలక సమావేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు ఈరోజు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో సమావేశమయ్యారు. హైడ్రా కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన వీహెచ్... అంబర్‌పేటలో బతుకమ్మకుంట భూవ్యవహారంపై చర్చించారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను ఆక్రమించారని, నిర్మాణాలు చేపట్టారని వీహెచ్ ఎప్పటి నుంచో




ఆరోపిస్తున్నారు. తాజాగా, హైడ్రా వచ్చిన నేపథ్యంలో ఆయన బతుకమ్మకుంట అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు.

**హైడ్రాపై కేటీఆర్ కీలక సమావేశం**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైడ్రాపై రేపు బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన భేటీ కానున్నారు. రేపు ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌లో సమావేశం జరగనుంది.

# రాజ్‌నాథ్ సింగ్ కాళ్లు మొక్కిన బండి సంజయ్

### రాడార్ శంకుస్థాపన కార్యక్రమం కోసం వచ్చిన రాజ్‌నాథ్ సింగ్

### హైదరాబాద్‌కు చేరుకున్న కేంద్రమంత్రికి బీజేపీ నేతల ఘన స్వాగతం

### శాలువా కప్పి సన్మానించిన బండి సంజయ్

**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్ర సహాయమంత్రి, తెలంగాణ బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కాళ్లు మొక్కారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో రాడార్ శంకుస్థాపన కార్యక్రమం కోసం రాజ్‌నాథ్ సింగ్ వచ్చారు. హైదరాబాద్




చేరుకున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఘన స్వాగతం పలికారు. కిషన్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కేంద్రమంత్రికి శాలువా కప్పిన బండి సంజయ్.. అంతకుముందు ఆయన పాదాలను తాకారు.

# భారత్ లోకి అడుగు పెట్టనున్న 6జీ...

ముంబై, అక్టోబరు 15, (న్యూస్ పల్స్)
వేగవంతమైన ఇంటర్నెట్ తో ప్రపంచం ఇప్పటికే ఎలా వేగంగా పనిచేస్తుందో చూస్తూనే ఉన్నాం. 3జీ, 5జీ లకు సంబంధించి భారతదేశం ఎలా పని చేసిందో ప్రపంచం మొత్తం చూసింది. ఇప్పుడు 6జీలో కూడా భారతదేశం ప్రపంచానికి కొత్త దిశను చూపబోతోంది. మన దేశ ఆర్థిక వ్యవస్థలో టెలికాం పరిశ్రమ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. భారతదేశం కూడా మొబైల్ కనెక్షన్లలో వేగవంతమైన పెరుగుదలను చూసింది. గతంలో 900 మిలియన్లు ఉండగా, ఇప్పుడు 1,150 మిలియన్లకు పెరిగింది. ఇంటర్నెట్ విషయానికొస్తే.. 200 మిలియన్ల నుండి 950 మిలియన్లకు చేరింది. భారతదేశం 3జీ, 4జీ, 5జీలలో ఫాలోవర్‌గా ఉంది. కానీ నేడు భారతదేశం 6జీలో మాత్రం ముందంజలో ఉంది. రానున్న కాలంలో యావత్ ప్రపంచం దృష్టి మన నెట్‌వర్క్‌పైనే ఉంటుంది. దేశవ్యాప్తంగా 5జీ సేవ షురూ అయింది. ప్రపంచంలోనే ఇంత వేగంతో 5జీ నెట్‌వర్క్‌ను విడుదల చేసిన మొదటి దేశం భారతదేశం. ఇప్పుడు ప్రభుత్వం 6జీ నెట్‌వర్క్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీని కోసం 6జీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంలో సహాయపడే అనేక విదేశీ సంస్థలు, ఇతర సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అభివృద్ధి చెందిన దేశానికి 6జీ నెట్‌వర్క్ అవసరమని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఎందుకంటే ఇది సాంకేతిక విషయాలలో వారధిగా పనిచేస్తుంది. 6జీ నెట్‌వర్క్ భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి అవసరమైన అభివృద్ధిని అందిస్తుందని టెలికాం సెక్రటరీ నీరజ్ మిట్టల్ అన్నారు. టెలికాం సెక్రటరీ నీరజ్ మిట్టల్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటికే 5జీ టెక్నాలజీ




ప్రారంభమైందన్నారు. ఇప్పుడు 6జీ నెట్‌వర్క్‌ని ప్లాన్ చేస్తున్నాం. అభివృద్ధి చెందిన దేశ హోదాను సాధించడంలో 6జీ నెట్‌వర్క్ అభివృద్ధిని ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. 6జీ నెట్‌వర్క్‌లను ప్రోత్సహించడానికి ప్రభుత్వం 150 ఏళ్ల టెలిగ్రాఫ్ చట్టాన్ని కొత్త టెలికమ్యూనికేషన్ చట్టంగా మార్చింది. ఇందులో, ప్రభుత్వం అనేక పెద్ద మార్పులను చేసింది. ఇది టెలికాం ఆపరేటర్లు తమ నెట్‌వర్క్‌ను విస్తరించడంలో గొప్పగా సహాయపడుతుంది. అలాగే, కొత్త ఆవిష్కరణలు 6జీ టెక్నాలజీని ప్రోత్సహించడంలో సహాయపడతాయి. దేశంలోని చాలా నగరాల్లో 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చింది. గ్రామాలు, గ్రామాలకు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 6జీ నెట్‌వర్క్ ఆవిష్కరణకు ప్రభుత్వం పెద్ద ఎత్తున సన్నాహాలు ప్రారంభించింది. టెలికమ్యూనికేషన్ రంగంలో ముందున్న దేశం రానున్న కాలంలో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదని ప్రభుత్వం విశ్వసిస్తోంది. వేగవంతమైన ఇంటర్నెట్‌కు ఫేమస్ అవుతున్న 5జీ కంటే రాబోయే 6జీ 100 రెట్లు వేగంగా ఉంటుంది. కేవలం ఒక సెకనులో 1టెరా బైట్ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేయగలం. 6జీ నెట్‌వర్క్‌లో 1000000ఓఎజూబ వేగం అందుబాటులో ఉంటుంది. 6జీ ప్రారంభించిన 2 సంవత్సరాలలో సుమారు 290 మిలియన్ల మంది ప్రజలు ఈ వైర్‌లెస్ టెక్నాలజీకి కనెక్ట్ కావచ్చని ఓ సర్వే అంచనా వేసింది. 6జీ సేవలను 2029 సంవత్సరంలో అధికారికంగా ప్రారంభించవచ్చు. ప్రజలు ఈ కొత్త టెలికమ్యూనికేషన్ టెక్నాలజీని చాలా వేగంగా జనాలు స్వీకరిస్తారని నివేదికలో పేర్కొన్నారు. 2030 చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 290 మిలియన్ల 6జీ కనెక్షన్లు రానున్నాయి. హై-ఫ్రీక్వెన్సీ స్పెక్ట్రమ్, నెట్‌వర్క్ జోక్యంతో టెలికాం కంపెనీలు ఎలాంటి అంతరాయం లేకుండా 6జీ టెక్నాలజీని ప్రారంభించేందుకు ఇప్పుడే సన్నాహాలు ప్రారంభించాలని నివేదిక హెచ్చరించింది.

# బెట్టింగ్ లు ,ఆన్లైన్ గేమ్స్ లకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్న యువకులు

**రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఆకులమైలారం లో చోరీ**

**ఆన్లైన్ లో పరిచయమై దొంగతనాల బాటపట్టిన నిందితులు**

**చోరీ కేసు ఛేదించిన గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు**

**హైదరాబాద్ పెన్ పవర్:** చదువుకున్న యువకులు బెట్టింగ్ లు ,ఆన్లైన్ గేమ్స్ లకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతుండగా పోలీసులు పట్టుకొని రిమాండ్ కు తరలించారు. ఇబ్రహీంపట్నం ఏసిపి కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డి గూడెం మండలం రామన్నగూడెం కు చెందిన ఉటుకూరి ప్రభాస్ తాత్కాలికంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ లో ఉంటూ కరీంనగర్ లో బీటెక్ చదువుతూ ఆన్లైన్ బెట్టింగ్ కు పాల్పడి లాస్ అయ్యాడు, మరొకరు నల్గొండ జిల్లా శాలిగౌరరం గ్రామానికి చెందిన గుండ్లపల్లి శివ మెడికల్ షాప్ వర్కర్ గా పనిచేస్తూ ఆన్లైన్ బెట్టింగ్ ఆడుతూ లాస్ అయ్యాడు. వీరిద్దరూ ఒకరికొకరు ఆన్లైన్ ఇన్స్టా గ్రామ్ లో పరిచయమయ్యారు. సులభమార్గంలో డబ్బులు సంపాదించడం కోసం చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. 10వ తేదీన ఒక బ్లూ కలర్ బేలానో (టీజీ07జీ8635) ను కిరాయికి తీసుకున్నారు. ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధుల నివాసాలను రిక్కి నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామంలో ఒంటరిగా వృద్ధురాలు దేవరశెట్టి సుమతమ్మ ఇంట్లోకి ప్రవేశించి ఆమె నోర్రు మూసి ఒలరు పట్టుకోగా మరొకరు మెడలో, చేతులకు 6 తులాల బంగారు ఆభరణాలు(4-బంగారు గాజులు, రెండు తులాల పుస్తెల తాడు)ను కత్తెరతో కత్తిరించుకొని చోరీకి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి చాకచక్యంగా ఇద్దరు నిందితులను

ఈ రోజు పట్టుకొని మీడియా ముందు ప్రవేశ పెట్టారు. వారినుండి బంగారు ఆభరణాలు, కారు, ఐ ఫోన్, కత్తెర స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించారు. ఉన్నత చదువులు చదివి ఆన్లైన్ బెట్టింగ్ లకు పాల్పడి సులభ మార్గాల్లో డబ్బులను సంపాదించుటకు యత్నించడం మనేయ్యలని సూచించారు. ఎలాంటి నేరం చేసిన పోలీసుల కు చిక్కగా తప్పదన్నారు. చేడు మార్గాల్లో డబ్బులు సంపాదించడం మనేయ్యలని, ఇది తల్లిదండ్రులు, యువకులు గుర్తుంచుకోవాలన్నారు. ఒంటరి మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిందితులను పట్టుకోవడం లో చాకచక్యంగా వ్యవహరించిన గ్రీన్ ఫార్మా సిటీ సిఐ కృష్ణమ్ రాజు, సిబ్బందిని ఏసీపి అభినందించి రివార్డులను అందజేశారు.

## పలు జిల్లాల్లో భారీ వర్షాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బాపట్ల జిల్లా చీరాల లో తెల్లవారుజాము నుండి కురుస్తున్న చెదురు ముదురు జల్లులకు రోడ్లు జలమయం కాగా పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేశారు. మరోవైపు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు.

## బాలుడి అనుమానస్పద మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** కాకినాడ రూరల్ ఎల్బీ నగర్ లో ఉన్న రాజేశ్వరీ రెసిడెన్సీ లో కుక్కల చరణ్ తేజ్ అనే 13 సంవత్సరాల బాలుడు అనుమానాస్పద మృతి చెందాడు. బాలుడు రాజేశ్వరీ రెసిడెన్సీ కు కొద్ది దూరంలో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ మళ్ళేశ్వరరావు సత్యదేవి దంపతుల కుమారుడు. తమ కొడుకుని ఎవరో కావాలని అపార్ట్మెంట్ పై నుండి క్రిందికి తోసి చంపెసారని బాలుడి తల్లితండ్రులు ఆరో?పిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కాకినాడ డిఎస్పీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## గుల్లలమోదలో క్షిపని పరీక్షా కేంద్రం

**హైదరాబాద్ పెన్ పవర్:** అవనిగడ్డ నియోజకవర్గం గుల్లలమోద గ్రామంలో క్షిపణి పరీక్షా కేంద్రం అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సారథ్యంలోని హై లెవెల్ సెక్యూరిటీ కమిటీ ఆమోదం తెలపడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ లోని బుద్ధప్రసాద్ స్వగృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం మంజూరు చేయడం ద్వారా అవనిగడ్డ నియోజకవర్గానికి కేంద్రం మహత్తర ప్రాజెక్టును ఇచ్చిందని అన్నారు. రాకెట్ ప్రయోగాలకు అనువైన ప్రాంతంగా గుల్లలమోద గ్రామాన్ని శాటిలైట్ ద్వారా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దాదాపు 30,000 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు నిర్మించనున్నారని అన్నారు. దీనికి సహకరించిన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రక్షణ శాఖ మంత్రి, డిఆర్డీవో పూర్వపు చైర్మన్ సతీష్ రెడ్డి లకు బుద్ధప్రసాద్ ధన్యవాదములు తెలిపారు.

## ఏపీ రోడ్లకోసం 400కోట్లు మంజూరు

**ఎక్స్ లో కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్లో 200.06 కిలోమీటర్ల పొడవైన 13 రాష్ట్ర రహదారుల అభివృద్ధికి కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి - సీఆర్ఎఫ్ నుంచి రూ.400 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. గుంటూరు- నల్లపాడు రైల్వే మార్గంలో రూ.98 కోట్లతో శంకర్ విలాస్ ఆర్వోబీని 4 వరుసలతో నిర్మించడానికి ఆమోదం తెలిపినట్లు అయన ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు గడ్కరీని కలిసి చర్చించిన నేపథ్యంలో మంజూరు అయ్యాయి.

## పొంగిన వాగులు నిలిచిన రాకపోకలు

**ఒంగోలు:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉగ్రరూపం దాల్చాయి. బాపట్ల జిల్లా ఇంకొల్లు సమీపంలోని దుద్దుకూరు వద్ద రెండు రోజులు గా కురుస్తున్న వర్షాలకు యార వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది .దీనితో ఇంకొల్లు - ఒంగోలు కు రాకపోకలు నిలిచి పోయాయి. పూసపాడు వద్ద ఉన్న కప్పల వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్చూరు - ఇంకొల్లు గ్రామాల మధ్య రాకపోకలకు కొంత మేర అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా పర్చూరు మండలంలో అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అల్పపీడన ప్రభావం వల్ల మరో రెండు రోజుల పాటు కొనసాగుతుందని..మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## పది నెలలుగా పెండింగ్ లో ఉన్న గురుకులాల అద్దె చెల్లించండి

మాజీ మంత్రి హరీష్ రావు.



హైదరాబాద్ పెన్ పవర్:ప్రభుత్వం 10 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో యజమాని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ కు తాళం వేసిన దుస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాల నిర్వహణ అధ్వాన్న స్థితికి చేరుకున్నదనడానికి ఇది మరొక నిదర్శనం. ముఖ్యమంత్రి గారు.. గురుకులాలకు అద్దెలు ఇంకెప్పుడు చెల్లిస్తారు? కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రోజురోజుకి దిగజారి పోతున్న విద్యావ్యవస్థ గురించి విద్యా శాఖ మంత్రిగా కూడా ఉన్న మీరు.. ఇంకెప్పుడు పట్టించుకుంటారని అయన ప్రశ్నించారు.

## డీఎస్సీ-2024 కౌన్సిలింగ్ ప్రక్రియ గందరగోళం

హైదరాబాద్ పెన్ పవర్:రంగారెడ్డి జిల్లాలో డీఎస్సీ-2024 ఎంపికైన అభ్యర్థులకు పాఠశాల కేటాయింపులకు మంగళవారం ఉదయం రామ్మన్నారు. జిల్లా నలుమూలల నుండి అభ్యర్థులు అక్కడకి చేరుకోగా కౌన్సిలింగ్ వాయిదా వేస్తున్నట్లు డిఈఓ ప్రకటనతో అభ్యర్థులు నిరాశతో వెనుదిగారు. వారు ఇంటికి చెరుకునే లోపే మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సిలింగ్ జరుగుతుందని అభ్యర్థులు డిఈఓ కార్యాలయం చేరుకోవాలని ఫోన్ ద్వార మరోసారి సమాచారం ఇవ్వడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

## కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు ఘన స్వాగతం

హైదరాబాద్ పెన్ పవర్: బేగంపేట్ ఎయిర్పోర్టులో రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు మరియు గనులు శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

## బాలిక మృతదేహం లభ్యం



హైదరాబాద్ పెన్ పవర్:మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాసరగడి గ్రామంలో గోనె సంచిలో బాలిక మృతదేహం లభించింది.స్థానికుల వివరాల ప్రకారం అదిలాబాద్ జిల్లా చెందిన ప్రభాకర్ గత ఏడు నెల కిందట కూలి పని కోసం వచ్చి తన కుటుంబం తో సూరారంలో నివాసం ఉంటున్నాడు .ఈ నెల 12 వ తేదీన తన కుమార్తె ఏం. జోష్ న (7) కనిపించడం లేదని సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు పోలీసులు కేసు నమోదు చేశారు.మంగళవారం ఉదయం బాసర గడి గ్రామంలో గోనె సంచిలో బాలిక శవమై కనిపించింది. సంఘటన స్థలానికి చేరుకొని మేడ్చల్ పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సింది

# రోగులపట్ల నిర్లక్ష్యం తగదు



హైదరాబాద్ పెన్ పవర్:వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం నిత్యం వందలమంది ప్రభుత్వాసుపత్రికి వస్తుంటారని, వారి ఆరోగ్యం పట్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు,సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేదే లేదని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ అనంతరం డాక్టర్లు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణీల పట్ల సోమవారం డాక్టర్లు డెలివరీ నిర్వహించకుండా ఆలస్యం చేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. పేదల ఆరోగ్యం కోసమే ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ ఉంటుందని, ఒక్క రోగి కూడా ఆస్పత్రిలో ఇబ్బంది పడకూడదని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పూర్తిస్థాయిలో అందేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ స్థాయిలో చికిత్స అందడం లేదని అన్నారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే దున్నపోతుపై వర్షం పడినట్లుగా ఉందన్నారు. కెసిఆర్ హయాంలో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకు 200లకు పైగా డెలివరీలు జరిగేవని ప్రస్తుతం ఆస్థాయి గణనీయంగా పడిపోయింది అన్నారు. గత రెండు నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రి పై ఒత్తిడి తీసుకురావడంతో డెలివరీల సంఖ్య వందకు పెరిగాయని భవిష్యత్తులో వీటిని 200 పెంచాలని డాక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోపం ఉంటే కెసిఆర్, బీఆర్ఎస్ నాయకుల మీద తీర్చుకోవాలి తప్పా పేద ప్రజల పైన కాదన్నారు. హుజురాబాద్, జమ్మికుంట ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరతగా ఉందని వెంటనే పూర్తిస్థాయిలో సిబ్బందిని నింపాలన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఒక గైనకాలజిస్ట్ తో పాటు అనస్తిష్టును వెంటనే కేటాయించాలని, అలాగే జమ్మికుంట కూడా గైనకాలజిస్టును నియమించాలన్నారు. గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్ తో పాటు డెలివరీ అయిన తర్వాత కెసిఆర్ కిట్ ని కూడా అందించాలన్నారు. కెసిఆర్ కిట్ కి పేరును మార్చిన పరవాలేదని, గర్భిణీ స్త్రీలకు గతంలో మాదిరిగానే ఆడపిల్ల పుడితే 13000 మగ బిడ్డ పుడితే 12000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా తిరిగి చేపట్టాలన్నారు. డాక్టర్లపై తమకు గౌరవం ఉందని ఆ గౌరవాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో ఎమ్మెల్యే వెంట అడిషనల్ . డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ చందూలాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారెడ్డి, ఆర్ ఎం ఓ సుధాకర్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు మరపల్లి సుశీల, తొగరు సదానందం, ఉమామహేశ్వర్, వెన్నంపల్లి కిషన్ తాళ్లపల్లి శ్రీనివాస్, కుమార్, సృజన పూర్ణచందర్, బొర్గాల శివకుమార్, నాయకులు ఇమ్రాన్, భాష బోయిన కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

హైదరాబాద్ పెన్ పవర్: జిల్లాలో మాదకద్రవ్యాలను నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ కమిటీల ఏర్పాటు చేయాలని, డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాల ద్వారా అలవాటు మానిపించాలని అన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు గా మారితే వచ్చే పరిణామా లు, మాదకద్రవ్యాల బానిస త్వం నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్ మొదలగు అంశాలను వివరించాలని, పేరెంట్స్ చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి తో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవా లని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని కలెక్టర్ సూచించారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా లోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని కలెక్టర్ డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుంద ని, ఆలోచనా విధానం, ఆలోచ నా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి జి. క్రిష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జిల్లా అటవీ అధికారి శివయ్య, జిల్లా ఆబ్కారి శాఖ అధికారి మహిపాల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన , కలెక్టరేట్ పర్యవేక్ష కులు ప్రకాష్, సంబంధిత అధికారులుతదితరులుపాల్గొన్నారు.

# సి ఎం ఆర్ లక్ష్యలను నూరు శాతం సాధించాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సి ఎం ఆర్, ఖరీఫ్ దాన్యం కేటాయింపు, మిల్లులు ట్యాగింగ్, మార్కెట్ కమిటీ లైసెన్సులు తదితర అంశాలపై పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార శాఖ, రైస్ మిల్లర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సి ఎం ఆర్ లక్ష్యం 77.46 శాతం పూర్తి చేశామని, మిగిలిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సి ఎం ఆర్ ప్రక్రియపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు మిల్లర్లు మార్కెట్ కమిటి లైసెన్స్ పొందాలని అన్నారు.

మిల్లర్లు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ధాన్యం సేకరణ, బియ్యం సరఫరా సక్రమంగా జరుగుతుందని ఆయన అన్నారు. సి.ఎం.ఆర్ లక్ష్యాలను సాధించడం చాలా

ముఖ్యమని, ప్రభుత్వానికి సహకరించడం ద్వారా రైతుల ప్రయోజనాలను కాపాడగలరని కలెక్టర్ తెలిపారు. సి ఎం ఆర్ లో పాల్గొనే ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా రెండు వేర్వేరు రిజిస్టర్లను నిర్వహించాలని అన్నారు. ఏ సమయంలోనైనా పరిశీలనకు అందించాలని పేర్కొన్నారు. దాన్యం కోనుగోలు గురించి మాట్లాడుతూ ట్యాగ్ చేయని కొనుగోలు కేంద్రాల నుండి దాన్యం స్వీకరించొద్దని, కేటాయించిన మేరకు మాత్రమే దాన్యం స్వీకరించాలని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకంలో జాగ్రత్తలు పాటించాలని, టోకెన్ కేటాయించాలని తెలిపారు. ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయడానికి తగినంత స్థలంతో పాటు దిగుమతి చేసేందుకు హమాలీలను ఏర్పాటు చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డిఎం రాములు, మార్కెటింగ్ డిఎం కనక శేఖర్, సహకార అధికారి వాలియా నాయక్, రైస్ మిల్లర్లు సంగం అధ్యక్షులు తిరుపతి, రైస్ మిల్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల గేట్లకు తాళాలు వేసిన వారి పై క్రిమినల్ కేసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** దసరా సెలవుల అనంతరం విద్యాశాఖకు సంబంధించి గురుకులాలు, కాలేజీలు , పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయి.. 70 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇది ఈ 10 నెలల్లో పెట్టిన బకాయిలు కాదు ఇది యజమానులు గమనించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి నాయకత్వంలో వివరాలు తెప్పించుకొని వాటిని విడుదల చేసి భవనాల సమస్యలు పరిష్కరించాలని సమావేశాలు కూడా నిర్వహించాము..నేడో రేపు నిధులు విడుదల చేసే సమయంలో ప్రభుత్వంతో ఎవరి మాటలు పట్టుకొని కావాల్సి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని కోరుతున్నానని అన్నారు. ఇది మంచిది కాదు ప్రభుత్వం బకాయిలు చెల్లించే ప్రక్రియ కొనసాగుతుంది..గురుకుల మంత్రిగా విజ్ఞప్తి చేస్తున్న ఇబ్బందితో గురుకుల పెట్టిన బ్యానర్లు వెంటనే తొలగించాలి. విద్యార్థులకు సక్రమంగా తరగతులు నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయి. పాత బకాయిలు ఇప్పించే బాధ్యత మాదని అన్నారు.

నేను ,ఉప ముఖ్యమంత్రి భక్తివిక్రమార్క అన్ని గురుకులాల పై సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. గురుకుల భవనా యజమానులకు విజ్ఞప్తి వెంటనే బ్యానర్లు తొలగించాలి.. విద్యార్థులకు స్వాగతం పలకండి. రి విద్యా బోధనకు ఆటంకం కలిగిస్తే చట్టపరంగా ఎటువంటి చర్యలు ఉంటాయో మీకు తెలుసు. మీకు బకాయిని చెల్లించే బాధ్యత మాది లేదంటే నన్ను గాని ,ముఖ్యమంత్రిని కానీ అధికారులను కలవండి..పాత బకాయిలతో సహా మెస్ చార్జీలు మూడు రోజుల క్రితమే చెల్లించాం.గురుకులాలు తాళం వేసి తలుపులు వేస్తే కఠిన చర్యలు ఉంటాయి.గురుకుల ప్రిన్సిపల్ అర్సీవో లు ఎక్కడైనా యజమానులు ఇబ్బందులు పెడితే పోలీస్ స్టేషన్ లో పిర్యాదులు చేయండి.. క్రిమినల్ చర్యలు తీసుకోండి. కలెక్టర్ లకి ఆదేశాలు ఇస్తున్నాం ప్రత్యామ్నాయంగా అక్కడ నుండి ఖాళీ చేసి వేరే భవనాలు చూడండి..బకాయిలు చెల్లించే బాధ్యత మాదని అన్నారు.

# గచ్చిబౌలి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అత్యాచారం కేసులో ఒకరు అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** గచ్చిబౌలి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అత్యాచారం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. బోరబండకు చెందిన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. అతన్ని విచారిస్తున్నారు. సోమవారం(అక్టోబర్ 14) అర్ధరాత్రి ఆర్‌సీ పురం వద్ద యువతి ఆటో ఎక్కింది. అప్పటికే అలసిపోయి ఉండటంతో మెల్లగా నిద్రలోకి జారుకుంది. దానిని పసిగట్టిన ఆటో డ్రైవర్ తన వాహనాన్ని గచ్చిబౌలి ఏరియాలోని మసీద్ బండ సమీపంలో ఉన్న కుడికుంట చెరువు వైపు తీసుకెళ్లాడు. అప్పటికి సమయం దాదాపు అర్ధరాత్రి 2.30 నిమిషాలు కావొస్తోంది. నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లాక నిద్రిస్తున్న యువతిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఉలిక్కిపడిన యువతి తనను తాను కాపాడుకోవడానికి గట్టిగా కేకలు వేసింది. దాంతో, భయపడిన ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై యువతి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం అర్ధరాత్రి ఆర్‌సీ పురం వద్ద తాను ఆటో ఎక్కినట్లు ఫిర్యాదులో పేర్కొన్న ఆమె.. 2:30 గంటల సమయంలో ఆటో మసీద్ బండ ప్రాంతానికి చేరుకోగానే డ్రైవర్ తనపై అత్యాచారం చేశాడని తెలిపింది. అనంతరం ఆటో డ్రైవర్ పారిపోయినట్లు వెల్లడించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

## ఆ' ఐడియా'మూగజీవాలకు వరం.



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆ రైతు ఐడియా మూగజీవాలకు వరంగా మారింది.మనకు వర్షాకాలంలో దోమలు కుడితే దోమలను పారదోలెందుకు ఎన్నో ఉపయోగాలు వేస్తాం.మనకు దోమలు కుట్టకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. కానీ మూగజీవాలకు ఆరు బయట కట్టి వేయడంతో వాటికి దోమలు కుట్టి ఎంతో ఇబ్బందులకు గురవుతుంటాయి. అలాగే పాల శాతం సైతం తగ్గుతుంది.

కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన అన్నవేన రాజయ్య అనే రైతు తమ గేదెలకు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. దీనిలో భాగంగా తామ గేదెల గుడిసెకు పూర్తిగ దోమల తెర కట్టి వాటికి దోమల కుట్టకుండా జాగ్రత్త తీసుకున్నాడు. మనం సైతం మూగజీవాలకు ఇటువంటి సౌకర్యాలు కలిగిస్తే మూగజీవాల దీవెన సైతం మనకు ఉంటుందని ఆశిద్దాం.

## మళ్లీ ఏడుపాయలను ముంచెత్తిన మంజీరా

**హైదరాబాద్ పెన్ పవర్:** సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో మంజీరా నదికి వరద పోటెత్తింది. ఏడు పాయల ఆలయం ఎదుట మంజీరా పరవళ్లు తొక్కుతోంది. మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు ఆలయాన్ని మూసేసారు. గర్భగుడిలో అమ్మవారికి పూజలు కొనసాగుతున్నాయి.

## గురుకుల పాఠశాలకు తాళం

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలకు భవన యాజమాని తాళం వేసాడు. తొమ్మిది నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో.. నిరసనగా మోత్కూర్ లోని గురుకుల పాఠశాలకు తాళాలు వేసాడు. దాంతో ఉపాధ్యాయులు, విద్యార్థులుపాఠశాలల బైట పడిగాపులు కాసారు.

## యాదగిరిగుట్ట సిఐపై బీఆర్ఎస్ పిర్యాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** యాదగిరిగుట్ట సీఐపై యాదగిరిగుట్ట ఏసీపి కి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గొంగిడి మహేందర్ రెడ్డి పిర్యాదు చేసారు. ఆలేరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఫిర్యాదు చేసారు. పోలీసులలో మార్పు రాకపోతే పోలీస్ స్టేషన్ ముందు పదివేల మంది బిఆర్ఎస్ కార్యకర్తలతో ధర్నా చేస్తాం అని హెచ్చరించారు.......

## రెంట్ చెల్లించలేదని పాఠశాలకు తాళాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వం గత 10 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మైనార్టీ స్కూల్ బిల్డింగ్ యజమాని దేవేందర్ రెడ్డి, స్కూల్ కు తాళం వేసిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో నేడు పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 340 మంది విద్యార్థులు మైనార్టీ పాఠశాలకు రానున్నారు ఇప్పటివరకు సిబ్బంది, ఉపాధ్యాయులు చేరుకుని తాళం వేసి ఉండేసరికి ఒక్కసారిగా కంగు తిని ఆరు బయట వేచి చూస్తున్నారు ఈక్రమంలో జిల్లా ఉన్నతాధికారులతో ఉపాధ్యాయులు మాట్లాడుతున్నట్లు తెలిపారు నేడు విద్యార్థులు రానున్న నేపథ్యంలో ఒక్కసారిగా మైనార్టీ స్కూల్ కు తాళం వేయడంతో ఆందోళన నెలకొంది, తాళం కోసం సంబంధిత స్కూల్ బిల్డింగ్ యజమానితో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.

## ఉర్సు గుట్ట పూలే పాఠశాలకు తాళాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**

ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల అద్దె భవనాలకు ప్రభుత్వం అద్దే చెల్లించకపోవడంతో దసరా సెలవుల తర్వాత భవన యజమానులు విద్యార్థులను ఉపాధ్యాయులను లోనికి పంపించని సంఘటన వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ మండలంలోని ఉర్సు గుట్ట సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో చోటుచేసుకుంది.

ఉర్సు మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల భవనానికి అద్దె చెల్లించాలని పాఠశాలకు యజమాని బండి కుమారస్వామి తాళం వేశారు.నెలకు 7 లక్షల వరకు ప్రభుత్వం చెల్లించవలసి ఉంది. 30 నెలల నుండి ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదని వాపోయాడు. 4వ తరగతి నుండి పదవ తరగతి వరకు 467 మంది విద్యార్థులు చదువురుండగా,ఇంటర్ లో 139మంది విద్యార్థులు చదువుతున్నారని,అంతేకాకుండా నెక్కొండ కు సంబంధించిన విద్యార్థులు అక్కడ వసతిగృహం సరిగా లేకపోవడంతో ఇక్కడే చదువుతున్నారని,వారు 145 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. భవనం లోపలికి వెళ్లకుండా అడ్డుకొని తల్లిదండ్రులను,పాఠశాల కళాశాల, ఉపాధ్యాయులను అడ్డుకోవడం తగదని పిల్లల భవిష్యత్ ఆలోంచించి తాళం ఓపెన్ చేయాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## దేశ రక్షణ విషయంలో కేంద్రం కట్టుబడి వుంది

కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్

**వికారాబాద్ పెన్ పవర్:** విఎల్ఎఫ్ ప్రాజెక్ట్ మన దేశానికి అత్యంత ఉపయోగకరమైనది. నేడు అబ్దుల్ కలాం జయంతి ఈ రోజు శంకుస్థాపన పనులు ప్రారంభించదం హర్షణీయమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్కి కృతజ్ఞతలు. దేశం భద్రత రక్షణ విషయంలో రాజకీయాలు చేయడం లేదని అన్నారు. దేశం యొక్క బలమైన మరియు భద్రత కోసం ఈ రకమైన స్టేషన్లు మన దేశానికి అత్యంత ముఖ్యమైనవి. పూర్వం కమ్యూనికేషన్ మరియు సమాచారం కోసం ఈగల్ మరియు ఇతర పక్షులను ఉపయోగించాము. ఇతర కమ్యూనికేషన్లను వ్యవస్థను బలోపేతం చేస్తు ఉపయోగిస్తున్నాము. కమ్యూనికేషన్ వ్యవస్థను వేగంగా అభివృద్ధి చేస్తున్నాము. గత ముప్పై సంవత్సరాల నుండి మన దేశం కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. దేశం బలమైన మిలిటరీని నిర్మించడానికి కట్టుబడి ఉందని అన్నారు.

కొందరు వ్యక్తులు ఈ ప్రాజెక్ట్ గురించి తప్పుడు సమాచారాన్ని సృష్టిస్తున్నారు. మరియు పర్యావరణానికి నష్టం జరిగిందని అంటున్నారు. ఈ ప్రాజెక్ట్ పర్యావరణానికి హాని కలిగించదని చెబుతున్నాను. కొంతమందికి తప్పుడు సమాచారం ఇస్తున్నారు. దేశ రక్షణ భద్రత విషయంలో కేంద్రం మరింత కట్టుబడి పనిచేస్తుందని అన్నారు.

# కెనడా భారత్ దేశాల మధ్య భగ్గుమన్న దౌత్యయుద్ధం

**హైదరాబాద్ పెన్ పవర్:**

భారత్, కెనడాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తి స్థాయిలో బెడిసికొట్టాయి. కెనడాలోని ఖలీస్థానీ వేర్పాటువాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యోదంతం ఇప్పుడు ఇరుదేశాల మధ్య తిరిగి చిచ్చు రగిల్చింది. కెనడా నుంచి తమ దేశ దౌత్య ఉన్నత ప్రతినిధి హై కమిషనర్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు భా రత ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఆ తరువాత కెనడా పట్ల తమ వైఖరిని కఠినతరం చేసింది. కెనడాకు చెందిన ఆరుగురు దౌత్యవేత్తే లు శనివారం లోగా బారతదేశం విడిచిపెట్టి వె ళ్లాలని ఆదేశించింది. మరో వైపు కెనడా కూ డా తమ దేశంలోని ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించింది. వీరు మోడీ ఏజెంట్లు అని, కెనడాలో వీరు సాగిస్తున్న క్రిమినల్ కార్యకలాపాలపై తగు సాక్షాధారాలు, సమాచారం తమ వద్ద ఉన్నాయని కెనడా పోలీసు వర్గాలు ప్రకటించాయి.దీనిని ప్రాతిపదికగా చేసుకుని రాయబారులను తాము బయటకు పంపిస్తున్నట్లు కెనడా ప్రభుత్వం ప్రకటించింది. పరస్పర ఆరోపణలు, దౌత్యవేత్తల బహిష్కరణలతో ఇప్పుడు ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలు పూర్తిగా తెగినట్లు అయ్యాయి. భద్రతా కారణాల వల్ల వెంటనే ఇండియా హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మను తిరిగి రప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు భారత ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇది తాము ముందుగా తీసుకుంటున్న చర్య కాదని, కెనడా ప్రభుత్వం నిజ్జర్ హత్య కేసు విచారణలో కెనడాలోని భారతీయ హై కమిషనర్‌ను అనుమానితుడిగా ప్రకటించడం, ఆయనపై దర్యాప్తు అవసరం ఉందని తెలియచేయడం కవ్వింపు చర్య అని భారత విదేశాంగ శాఖ సోమవారం మండిపడింది. అక్కడి ఉగ్రవాది హత్య ఎందుకు జరిగిందనేది సరైన రీతిలో ఆరా తీయకుండా, భారతదేశంపై అనుమానాలు వ్యక్తం చేయడం, ఈ క్రమంలో చివరికి హైకమిషనర్ కూడా విచారణ వ్యక్తుల జాబితాలో ఉన్నట్లు తెలియచేయడం అసాధారణ చర్య అవుతుందని భారత ప్రభుత్వం ధీటుగా స్పందించింది.ప్రస్తుత పరిస్థితుల్లో కెనడాలోని భారత హై కమిషనర్‌కు కానీ సిబ్బందికి కానీ అక్కడి ప్రస్తుత ప్రభుత్వం సరైన రక్షణ ఇస్తుందనే నమ్మకం లేదు. ఇందుకు



అవసరం అయిన కట్టుబాట్లకు కూడా వారు దిగుతారని తాము అనుకోవడం లేదని, ఈ దశలో హై కమిషనర్ భద్రతను పరిగణనలోకి తీసుకుని వెంటనే వెనకకు పిలిపించాలనే నిర్ణయానికి వచ్చినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విషయాన్ని తాము సోమవారం సాయంత్రం కెనడాకు చెందిన దౌత్య వ్యవహారాల ఇన్‌చార్జికి తెలియచేసినట్లు కూడా విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడించింది. అక్కడి ట్రూడో ప్రభుత్వం చర్యలు దౌత్య సిబ్బంది భద్రతకు అనుగుణగా లేవు. అక్కడ పూర్తి స్థాయిలో తీవ్రవాదం, అంతకు మించిన వేర్పాటువాద ఉగ్రవాదం పెచ్చరిల్లింది. సంబంధిత హింసాకాండ ప్రమాదకరం అయిందని విదేశాంగ మంత్రిత్వశాఖ తమ ప్రకటనలో తెలిపింది. ఇప్పుడు భారత్‌కు వేరే దారి లేదు. అక్కడి రాయబారిని వెంటనే స్వదేశానికి తిరిగి తీసుకురావడం కీలకం అయిందని వివరించారు. తమకు అందిన సమాచారం మేరకు కెనడాలో హై కమిషనర్, కొందరు దౌత్యవేత్తలను ఉగ్రవాదులు తమ హిట్‌లిస్టులో పెట్టుకున్నట్లు, ఈ మేరకు వారి వద్ద నిర్ధేశిత జాబితా ఉన్నట్లు తెలిసిందని,ఈ పరిస్థితుల్లో వారందరిని ఇక్కడికి తీసుకురావడం కీలక విషయం అయిందని విదేశాంగ శాఖ తెలిపింది.తమ దేశ పౌరుడు అయిన నిజ్జర్ పూర్వాపరాల సంగతి పక్కన పెడితే తమ దేశ పౌరుడి హత్య జరిగినందున , దీని వెనుక భారతదేశ నిఘా సంస్థలు ఇతర అధికారుల హస్తం ఉందని భావించినందున తాము సంబంధితులందరిపైనా దర్యాప్తు జరిపి తీరుతామని పలుసార్లు కెనడా ప్రధాని ట్రూడో చెపుతూ వచ్చారు. ఇప్పుడు తాజాగా భారత హై కమిషనర్ పాత్రపై దర్యాప్తు జరుగుతున్నట్లు , ఆయన తమ పర్సన్ ఆఫ్ ఇంట్రెస్టు జాబితాలో ఉన్నట్లు కెనడా ప్రకటించడంతో ఇంతవరకూ అంతర్గతంగా రగులుకుంటున్న వివాదం ఇప్పుడు మరింత భగ్గు మంది.సోమవారం పలు కీలక పరిణామాలు చకచకా జరిగాయి. సోమవారం సాయంత్రం కెనడా రాయబారి స్టీవర్ట్ వీలర్‌కు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ సమన్లు వెలువరించింది. ఆయనను పిలిపించి కెనడా ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని నిలదీసింది. కెనడాలో ఓటు బ్యాంక్ రాజకీయాల్లో లబ్ధి కోసం ప్రధాని ట్రూడ్ అచారక రీతిలో దౌత్యవేత్తలపై తప్పుడు ఆరోపణలు చేస్తే, చివరికి హత్యోదంతం, అందులోనూ ఓ ఉగ్రవాది అంతం విషయంలో ఏకంగా హై కమిషనర్, ఆయన పరిధిలోని దౌత్యసిబ్బందిని అనుమానితులుగా పేర్కొనడం గర్హనీయం అని తెలిపారు. ఆ తరువాత హై కమిషనర్ ఉపసంహరణ నిర్ణయం ప్రకటించారు.

# దేశ రక్షణ విషయంలో రాజీ పడోద్దు

వీఎల్ఎఫ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

**వికారాబాద్ పెన్ పవర్:**

వికారాబాద్ పూడూర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. దేశ రక్షణలో తెలంగాణ రాష్ట్రం మరో కీలక అడుగు ముందుకు వేయబోతోంది. దేశ రక్షణకు సంబంధించి కీలకమైన డిఫెన్స్,ఎన్.ఎఫ్.సీ లాంటి కేంద్రాలకు హైదరాబాద్ గుర్తింపు పొందింది. కొందరు వీఎల్ఎఫ్ ను వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. వీఎల్ఎఫ్ తో ప్రజలకు అన్యాయం జరుగుతుందని అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులోనూ 1990లో ఇలాంటిదే ప్రారంభించారు. అక్కడి ప్రజలకు ఎలాంటి నష్టం జరగలేదు. దేశంలో రెండో వీఎల్ఎఫ్ మన ప్రాంతంలో రావడం గర్వకారణం. ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తించాలి. వివాదాలకు తెరలేపుతున్నవారు దేశ రక్షణ గురించి ఆలోచన చేయాలి. దేశం ఉంటేనే మనం ఉంటాం.. మనం ఉంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దేశ రక్షణ కోసం ఏర్పాటు చేసే ప్రాజెక్టులను కూడా రాజకీయాల మోసం వివాదం చేసేవారికి కనువిప్పు కలగాలి. 2 017లోనే భూ బదలాయింపు, నిధుల కేటాయింపు లాంటి పూర్తి నిర్ణయాలన్నీ గత ప్రభుత్వ హయాంలోనే జరిగాయి. ప్రాజెక్టును ప్రారంభించాలని రాజ్ నాథ్ సింగ్ అడగగానే మేం కొనసాగించాం దేశ రక్షణ విషయంలో రాజీ పడొద్దనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించా. పర్యావరణ ప్రేమికులకు నేను ఒకటే చెబుతున్నా. దేశం, దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ రక్షణ గురించి ఆలోచించగలం. దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్ట్ ను వివాదాస్పదం చేయడం సమంజసం కాదు. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీలు, రాజకీయాలు... దేశ రక్షణ విషయంలో కలిసికట్టుగా ముందుకెళ్లాలి. వీఎల్ఎఫ్ ను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని అన్నారు.

ఇక్కడ ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చేవారిని అనుమతించాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ కి విజ్ఞప్తి చేస్తున్నా.ఆలయానికి ఇబ్బందులు కలిగించొద్దని కోరుతున్నా. ప్రజల సెంటిమెంట్, విశ్వాసాన్ని గౌరవించి ఆలయానికి వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరుతున్నా. ఈ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే విద్యా సంస్థల్లో ఈ ప్రాంత ప్రజలకు 1/3వ వంతు సీట్లు కేటాయించాలని కోరుతున్నానని అన్నారు.